VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

RNI NO : APTEL/2016/69464

# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 95

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

బుధవారం 9 సెప్టెంబర్ 2026

## వాట్సప్ గవర్నెన్స్, డిజిటల్ సేవలు.. పాలనలో బెస్ట్ ప్రాక్టీసెస్ పాటించాలి: ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

**● ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేయాలని సీఎం ఆదేశం ● ఎమ్మార్పీ కంటే ఎక్కువకు మద్యం అమ్మితే కఠిన చర్యలని హెచ్చరిక ● ఫేక్ ప్రచారాన్ని వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని నేతలకు సూచన ● 175 నియోజకవర్గాల్లో రూ.20,400 కోట్ల విలువైన పనులకు ఆమోదం ● టెక్నాలజీ సాయంతో ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి**

**అమరావతి,కలంకౌంటర్ :** ప్రభుత్వ, పరిపాలన సేవలను ప్రజలకు మరింత సమర్థంగా అందించడంపై దృష్టి సారించాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు పిలుపునిచ్చారు. రెండోరోజు లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో ప్రసంగించిన ఆయన, కొన్ని నియోజకవర్గాలు పౌర సేవల్లో మంచి ఫలితాలు సాధిస్తున్నాయని, అన్ని నియోజకవర్గాలు ఆ ఉత్తమ పద్ధతులను (బెస్ట్ ప్రాక్టీసెస్) అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేస్తున్నామని, దీనివల్ల ఏటా రూ.1000 కోట్ల ఆదాయం వదులుకుంటున్నామని చంద్రబాబు గుర్తుచేశారు. ఎక్కడైనా ఇసుక అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిపోతే కఠినంగా అడ్డుకోవాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం విధానాన్ని అస్తవ్యస్తం చేసి, నకిలీ బ్రాండ్లతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని విమర్శించారు. ఇప్పుడు మద్యం విక్రయాల్లో పారదర్శకత తీసుకొచ్చామని, ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి ఎక్కువకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయంలో అవకతవకలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యేలదేనని స్పష్టం చేశారు.



**ఫేక్ ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టండి..** ప్రభుత్వంపై జరుగుతున్న ఫేక్ ప్రచారాలను వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని నేతలకు సూచించారు. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అనేక సేవలను ఆన్‌లైన్‌లోనే అందిస్తున్నామని, క్యూఆర్ కోడ్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో భద్రమైన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని వివరించారు. నియోజకవర్గాల్లోని దీర్ఘకాలిక సమస్యలను సుమోటోగా స్వీకరించి పరిష్కరించాలని, తద్వారా ఎమ్మెల్యేలకు ప్రజల్లో మంచి పేరు వస్తుందని అన్నారు. ప్రజల సమస్యల పట్ల మానవత్వంతో స్పందిస్తే సానుకూల దృక్పథం ఏర్పడుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా భూ వివాదాల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, 2027 మార్చి నాటికి భూ రికార్డుల ప్రక్షాళన పూర్తి చేస్తామని చంద్రబాబు వెల్లడించారు. 'సంజీవని' ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందిస్తున్నామని, గత మూడేళ్లుగా విద్యుత్ ఛార్జీలు పెంచలేదని గుర్తుచేశారు. గత సమావేశంలో ఎమ్మెల్యేలు లేవనెత్తిన అంశాలను సమీక్షించి, 175 నియోజకవర్గాల్లో రూ.20,400 కోట్ల విలువైన 616 అభివృద్ధి పనులను మంజూరు చేసినట్లు ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.

## క్లస్టర్లవారీగా కామన్ ఫెసిలిటీ సెంటర్ల ఏర్పాటు దిశగా అడుగులు

**● పార్వతీపురం మన్యంలో స్థల సేకరణ పూర్తి, నిర్మాణ పనులు ప్రారంభం ● మదనపల్లి, అనంతపురం, పెడనల్లో స్థలాల గుర్తింపు ప్రక్రియ పూర్తి ● ఎంపీ ల్యాడ్స్‌తో ఉదయగిరి కమ్యూనిటీ సెంటర్‌కు మరమ్మత్తులు ● ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ దిశానిర్దేశంతో ఏటికొప్పాక ఆరోగ్య కేంద్రం పనులు పునఃప్రారంభం ● హస్తకళాకారుల సర్వతోముఖాభివృద్ధి దిశగా చర్యలు వేగవంతం**



**విజయవాడ, కలంకౌంటర్ :** మన సంప్రదాయ హస్తకళల వారసత్వ పరిరక్షణ, హస్తకళాకారులకు చేయూత ఇచ్చేందుకు చేపట్టిన కార్యక్రమాలను వేగవంతంగా ముందుకు తీసుకువెళ్లాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు స్పష్టం చేశారు. హస్తకళాకారుల సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పన, మెరుగైన మార్కెటింగ్ వసతుల కల్పన ద్వారా మెరుగైన జీవనోపాధి, ఆరోగ్య రక్షణ తదితర అంశాలను అత్యంత ప్రాధాన్యతా క్రమంలో ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. ముఖ్యంగా క్లస్టర్లవారీగా నిర్మించతలపెట్టిన కామన్ ఫెసిలిటీ సెంటర్ల ఏర్పాటు వివరాలు అధికారుల నుంచి పొందారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవ ప్రారంభోత్సవం కార్యక్రమంలో విభిన్న హస్తకళలను వారసత్వంగా ముందుకు తీసుకువెళ్తున్న కళాకారులతో మమేకమయ్యారు. స్వయంగా వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలకు పరిష్కార మార్గాలు అన్వేషించి, స్వీయ పర్యవేక్షణలో ముందుకు తీసుకువెళ్తున్నారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థతోపాటు జిల్లా యంత్రాంగంతో నిరంతరం సమీక్షిస్తూ హస్తకళాకారులకు ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తున్నారు.

**వీబీ-జీ రామ్ జీ నిధులతో సవర కళాకారులకు సిద్ధమవుతున్న కామన్ ఫెసిలిటీ సెంటర్..** క్లస్టర్ల వారీగా హస్తకళాకారులకు శిక్షణ, వారు రూపొందించిన కళాఖండాలను భద్రపరుచుకోవడం, ప్రదర్శనకు ఉంచడం, మార్కెటింగ్ తదితర కార్యకలాపాల నిమిత్తం కామన్ ఫెసిలిటీ సెంటర్లు ఏర్పాటు చేయాలని హస్తకళా మహోత్సవంలో పలువురు కళాకారులు అడగగా, ఏర్పాటుకు ఉప ముఖ్యమంత్రివర్యులు హామీ ఇచ్చారు. తక్షణం అందుకు కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఇప్పుడు ఇచ్చిన హామీ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు, లేపాక్షి అధికారులకు స్థల సేకరణ, నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. సవర గిరిజన చిత్రకారుల కోసం పార్వతీపురం మన్యం జిల్లా, సీతంపేట మండలంలో కామన్ ఫెసిలిటీ కోసం స్థల సేకరణ పూర్తి చేయడంతో పాటు వీబీ-జీ రామ్ జీ నిధులతో నిర్మాణ పనులు కూడా ప్రారంభించారు. దీంతో పాటు అన్నమయ్య జిల్లా మదనపల్లి బంజారా బ్యాగ్ కళాకారులు, అనంతపురం జిల్లా కురుగుంట్ల అరటినారు కళాకారులు, పెడన పెన్ కలంకారీ కళాకారుల కోసం ఏర్పాటు చేయనున్న కమ్యూనిటీ సెంటర్ స్థలాల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేశారు. నిర్మాణ అనుమతులు, ఇతర ప్రక్రియలు పూర్తి చేసి త్వరలోనే పనులు ప్రారంభం కానున్నట్టు అధికారులు వివరించారు.

**లింగమనేని రమేష్ ఎంపీ ల్యాడ్స్ నిధులతో ఉదయగిరి కమ్యూనిటీ సెంటర్ మరమ్మత్తులు..** నెల్లూరు జిల్లాకు చెందిన ఉదయగిరి సంప్రదాయ చెక్క పాత్రల తయారీ కళాకారుల కోసం ఏర్పాటు చేసిన కమ్యూనిటీ సెంటర్‌ను అభివృద్ధి చేయాలన్న కళాకారుల విజ్ఞప్తి మేరకు అక్కడ మరమ్మత్తులు చేపట్టారు. శ్రీ పవన్ కళ్యాణ్ గారి ఆదేశాల మేరకు రాజ్యసభ సభ్యులు శ్రీ లింగమనేని రమేష్ గారి ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ. 12 లక్షలు నిధులు కేటాయించారు. ఆ నిధులతో ఈ పనులు చేపట్టనున్నారు. వీటితో ప్రహరీ గోడ నిర్మాణం, మరుగుదొడ్లు, స్టోర్ రూమ్ తదితర సదుపాయాలకు సంబంధించిన అభివృద్ధి పనులు ముందుకు

- 4లో

## కార్యకర్తల పోరాటం, త్యాగాల వల్లే అధికారంలోకి వచ్చాం

**● ఎన్నికల్లో గెలవాలంటే బలహీనతల్ని గుర్తించి అధిగమించాలి ● పార్టీ, పర్సనల్, ప్రభుత్వం.. మూడు 'పీ'లను అందరూ పాటించాలి ● కష్టపడి పనిచేసే కార్యకర్తలను గుర్తించాలి ● డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియని వ్యక్తి జగన్ ● కలిసికట్టుగా రాష్ట్రాన్ని, పార్టీని నడిపిద్దాం ● టీడీపీ లీడర్ షిప్ కాంక్లేవ్ ముగింపు సభలో తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ ● చంద్రబాబు గారి అక్రమ అరెస్ట్ కు రేపటితో మూడేళ్లు ● 'నిజం గెలిచింది' పేరుతో రాష్ట్రవ్యాప్త కార్యక్రమానికి పిలుపు**




**అమరావతి,కలంకౌంటర్ :** కార్యకర్తల పోరాటం, త్యాగాల వల్లే అధికారంలోకి వచ్చామని, ఎన్నికల్లో గెలవాలంటే బలహీనతల్ని గుర్తించి అధిగమించాలని టీడీపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన లీడర్ షిప్ కాంక్లేవ్ ముగింపు సభలో మంత్రి మాట్లాడుతూ.. మనందరం నాయకులుగా ఇక్కడ కూర్చొన్నామంటే అందుకు కారణం కార్యకర్తల త్యాగం. ఒక తోట చంద్రయ్య, నందం సుబ్బయ్య, మంజుల వంటి కార్యకర్తలపై ఆనాడు దాడులకు పాల్పడ్డారు. కొంతమందిని హతమార్చారు. వారి పోరాటం వల్లే మనం అధికారంలోకి వచ్చాం. దీనిని అందరూ గుర్తుపెట్టుకోవాలి. ఇది రొటీన్ కాంక్లేవ్ కాదు. నాయకులకు శిక్షణ ఇచ్చేందుకే ఈ కాంక్లేవ్ పెట్టాం. కార్యకర్తలకు, ప్రజలకు ఎలా దగ్గర కావాలి, పార్టీ బలోపేతం కోసం ఏం చేయాలనే అంశాలపై చర్చించేందుకు ప్రతి మూడు నెలలకోసారి కాంక్లేవ్ నిర్వహిస్తాం.

**ఎన్నికల్లో గెలవాలంటే బలహీనతల్ని గుర్తించి అధిగమించాలి..** 2019లో మంగళగిరిలో 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. ఆనాడు అనేక మంది విమర్శించారు. 2024 ఎన్నికల్లో 91వేల మెజార్టీతో గెలుపొందాను. నాయకులకు వారి బలహీనతలేంటో చెప్పగలగాలి. నాయకులు పుట్టరు, నాయకులు తయారవుతారు. నేను నాయకుడిగా ఎదిగానంటే ఆ క్రెడిట్ చంద్రబాబు గారిది కాదు.. సైకోది. రాష్ట్రస్థాయిలో మిమ్మల్ని నాయకులుగా గుర్తించే ఈ సమావేశానికి ఆహ్వానించాం. మన బలహీనతల్ని గుర్తించి, అధిగమించడానికే ఈ కాంక్లేవ్. ఎన్నికల్లో తిరిగి గెలవాలంటే మన బలహీనతల్ని గుర్తించి అధిగమించాలి. ఇందుకు ఎంతో మంది నాయకులు మనకు మోడల్స్ గా ఉన్నారు. గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రామానాయుడు, అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు వంటి నాయకులు మనకు మోడల్స్ గా ఉన్నారు. ఒక్కొక్కరిది ఒక్కో స్టైల్. వారి నుంచి మనం నేర్చుకోవాలి. దేశంలో కూడా మనకు మోడల్స్ ఉన్నారు. సీఆర్ పాటిల్ మనకు ఆదర్శం.

**పార్టీ, పర్సనల్, ప్రభుత్వం.. మూడు 'పీ'లను సీరియస్ గా తీసుకోవాలి..** మూడు 'పీ'లను నేను ప్రతిపాదిస్తున్నాను. వీటిని అందరూ పాటించాలి. పార్టీ, పర్సనల్, ప్రభుత్వం. వీటిని సీరియస్ గా తీసుకోవాలి. పర్సనల్ గా ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలి. బాధ్యతగా ఉండాలి. నాయకులుగా మనం ముందు వినగలగాలి. దీనిని నేను ప్రధాని మోదీ గారి నుంచి నేర్చుకున్నాను. ఒక ప్రధానిగా ఉండి ఆయన నా నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటారు. మీరు కూడా ఫీడ్ బ్యాక్ తీసుకుని మనల్ని మనం మార్చుకోవాలి. మానవత్వం, అణకువతో ప్రజలతో సంబంధాలు మెరుగుపర్చుకోవాలి. ఎదిగేకొద్దీ ఒదిగి ఉండాలి. ప్రజలు సింప్లిసిటీ కోరుకుంటున్నారు. గ్రామాలకు వెళ్లినప్పుడు అందరినీ కలవాలి. మనమే వంద మందిని వెంటేసుకుని వెళ్లకూడదు. వ్యక్తిగత క్రమశిక్షణ చాలా అవసరం. ప్రజలు మన ఇళ్లలో జరిగే విషయాలను కూడా గమనిస్తారు. నీతులు మనం చెప్పడమే కాదు.. పాటించాలి.

**కష్టపడి పనిచేసే కార్యకర్తలను గుర్తించాలి..** రెండో పీ.. పార్టీ. కష్టపడి పనిచేసే కార్యకర్తలను గుర్తించాల్సిన బాధ్యత మనపై ఉంది. మన సైన్యం సరిగా ఉంటేనే యుద్ధంలో గెలుస్తాం. పార్టీకి దూరంగా ఉన్నవారిని, అలకబూనిన వారిని గుర్తించి దగ్గరికి తీసుకోవాలి. ఎన్నికల్లో ప్రభావితం చేయగలిగిన వారిని గుర్తించాలి. కార్యకర్తలకు చేయగలిగే పనులు చేయాలి. నియోజకవర్గంలో ఏ చిన్న సమస్య అయినా సీరియస్ గా తీసుకోవాలి. గూగుల్ కోసం తెలంగాణ, మహారాష్ట్రలు పోటీపడుతున్నాయి. అదే గూగుల్ మన వైజాగ్ కు వస్తే దుష్ప్రచారం చేస్తున్నారు. అందరం కలిసికట్టుగా తిప్పికొట్టాలి.

**డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియని వ్యక్తి జగన్..** డీఎస్సీ విషయంలో మనం ఏ తప్పూ చేయలేదు. జగన్ ఏనాడు బాబాయి హత్య, ఏపీపీఎస్సీ, దస్తగిరి, లిక్కర్ స్కామ్ గురించి మాట్లాడలేదు. డీఎస్సీ గురించి మాట్లాడుతున్నారు. మనకు చిత్తశుద్ధి ఉంది కాబట్టే డీఎస్సీపై అందరం మాట్లాడుతున్నాం. 16వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం. డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియని వ్యక్తి జగన్ రెడ్డి. వైసీపీ హయాంలో ఇచ్చింది సున్నా. ఐదేళ్లలో మనం 30వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తాం. డీఎస్సీ విషయంలో సుప్రీంకోర్టు కూడా కొట్టేసింది. వైసీపీ అబద్ధాలు చెప్పినంత ఈజీగా మనం నిజాలు చెప్పలేకపోతున్నాం. వాస్తవాలు ప్రజలకు వివరించాలి. వైసీపీ దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి. కాకినాడలో పోలీస్ రిక్రూట్ మెంట్ గురించి ఆందోళన జరిగింది. వైసీపీ హయాంలో ఇచ్చింది సున్నా. మనం 6వేల కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేశాం. ఈ ఏడాది 3వేలు భర్తీ చేస్తున్నాం. ఈ ఐదేళ్లలో 10వేల పోస్టులు భర్తీ చేస్తాం. అయినా మనల్ని ఛాలెంజ్ చేస్తున్నారు. వీటన్నింటినీ తిప్పికొట్టాలి. 2024 టీమ్ అద్భుతంగా పనిచేసిందని చంద్రబాబు మెచ్చుకునే విధంగా మన పనితీరు ఉండాలి. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను సీరియస్ గా తీసుకోవాలి. నెలకోసారి జిల్లా ప్రజాప్రతినిధులు కలిసి కూర్చొని మాట్లాడుకోవాలి. ఏదైనా సమస్య ఉంటే కలిసికట్టుగా చేయాలి. మన మధ్య ఐక్యత అవసరం. ఏవైనా సమస్యలు ఉంటే అధిష్టానం దృష్టికి తీసుకురావాలి.

**ప్రభుత్వ కొనసాగింపు అనేది చాలా ముఖ్యం..** మూడో పీ.. ప్రభుత్వం. నేతలు పోస్ట్ ఆఫీస్ లా మారకూడదు. లీడర్ లా వ్యవహరించాలి. నేతలు తమ నియోజకవర్గాల్లోని పాఠశాలలు, ఆసుపత్రులు, వసతిగృహాలకు వెళ్లి తనిఖీ చేయాలి. చేసిన పనులు చెప్పుకోవాలి. డీఆర్సీ సమావేశాన్ని

- 2లో

## పరిశ్రమలు తమ ఖాళీ స్థలాలను హరిత వనాలుగా మార్చాలి

**● స్థానిక వృక్ష జాతులతో గ్రీన్ బెల్ట్‌ను మరింత విస్తరించాలి ● నాటిన మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి ● మియావాకి పద్ధతిలో దట్టమైన వనాలను అభివృద్ధి చేయాలి ● దివిస్‌లో గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి, ప్లాంటేషన్ కార్యక్రమాలపై ఏపీ గ్రీన్ చైర్మన్ నాగబాబు సమీక్ష ● ఉద్యోగులతో కలిసి మొక్కలు నాటిన నాగబాబు**






**విజయవాడ, కలంకౌంటర్ :** పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణకు పరిశ్రమలు తమ గ్రీన్ బెల్ట్‌ను మరింత విస్తరించి, స్థానిక వృక్ష జాతులతో దట్టమైన పచ్చదనాన్ని అభివృద్ధి చేయాలని ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ శ్రీ నాగబాబు గారు స్పష్టం చేశారు. పరిశ్రమల యాజమాన్యాలు, ఉద్యోగులు సమష్టి బాధ్యతతో నిరంతరం కృషి చేసినప్పుడే పర్యావరణానికి మేలు చేసే స్థిరమైన గ్రీన్‌బెల్ట్‌ను అభివృద్ధి చేయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మంగళవారం కాకినాడ జిల్లా తొండంగి మండలం ఒంటిమామిడి గ్రామంలోని దివిస్ లేబొరేటరీస్ ను సందర్శించి, పరిశ్రమలో కొనసాగుతున్న గ్రీన్ బెల్ట్ అభివృద్ధి, ప్లాంటేషన్ కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీ నాగబాబు గారు మాట్లాడుతూ "పరిశ్రమలు తమ పరిధిలోని ఖాళీ ప్రదేశాలను వినియోగించుకుని గ్రీన్ బెల్ట్‌ను మరింత విస్తరించాలి. పెద్దగా పెరిగే స్థానిక వృక్ష జాతులకు ప్రాధాన్యం ఇచ్చి మొక్కలు నాటాలి. అనుకూలమైన ప్రతి చోట మియావాకి పద్ధతిలో దట్టమైన వనాలను అభివృద్ధి చేయాలి. పరిశ్రమలలో అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలన్నింటినీ దశలవారీగా హరిత వనాలుగా మార్చాలి. నాటిన మొక్కల సంరక్షణ, మనుగడపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి" అన్నారు.

**దివీస్ ల్యాబ్స్‌లో గ్రీన్ బెల్ట్ పరిశీలించిన నాగబాబు..** అంతకు ముందు శ్రీ నాగబాబు గారు దివీస్ పరిశ్రమ ప్రాంగణాన్ని సందర్శించి, ఇప్పటికే అభివృద్ధి చేసిన గ్రీన్ బెల్ట్, మొక్కలు నాటిన ప్రాంతాలను పరిశీలించారు. అలాగే భవిష్యత్‌లో మరింత హరిత ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశ్రమ ప్రతినిధులు ప్రస్తుతం చేపడుతున్న ప్లాంటేషన్ కార్యక్రమంతోపాటు, భవిష్యత్‌లో గ్రీన్ బెల్ట్‌ను మరింత విస్తరించేందుకు రూపొందించిన ప్రణాళికలను శ్రీ నాగబాబు గారికి వివరించారు. అనంతరం దివిస్ లేబొరేటరీస్‌కు చెందిన 100 మందికి పైగా ఉద్యోగులతో కలిసి శ్రీ నాగబాబు గారు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఉద్యోగులు చురుకుగా పాల్గొనడాన్ని ఆయన అభినందించారు. ఇప్పటి వరకు పరిశ్రమ ప్రాంగణంలో వివిధ జాతులకు చెందిన మొత్తం 25,150 మొక్కలను నాటినట్లు పరిశ్రమ ప్రతినిధులు శ్రీ నాగబాబు గారికి తెలిపారు. అనంతరం దివిస్ లేబొరేటరీస్ ప్రతినిధులు పరిశ్రమ చేపడుతున్న సీఎస్ఆర్ కార్యక్రమాలపై శ్రీ నాగబాబు గారికి వివరాలను అందించారు. పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవల కోసం కేటాయిస్తున్న సీఎస్ఆర్ నిధులు, వాటి వినియోగం, అలాగే సీఎస్ఆర్‌లో భాగంగా అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.

## కిలో ఉల్లిగడ్డలు 32 రూపాయలే: మంత్రి నాదెండ్ల మనోహర్

**● సామాన్యులకు ఊరట కల్పించేలా కూటమి ప్రభుత్వం చర్యలు ● కిలో ఉల్లిపాయలు రాయితీపై రూ.32కే అందించాలని నిర్ణయం ● వచ్చే వారం నుంచి 115 రైతు బజార్లలో విక్రయాలు ● చౌకడిపోల్లో కందిపప్పు, పామాయిల్ కూడా అందుబాటులోకి ● బహిరంగ మార్కెట్ కన్నా 30 శాతం తక్కువ ధరకే సరుకులు**

**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్‌లో నిత్యావసరాల ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న సామాన్య ప్రజలకు కూటమి ప్రభుత్వం ఊరట కల్పించే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. వంటింటి భారాన్ని తగ్గించే లక్ష్యంతో, కిలో ఉల్లిపాయలను కేవలం రూ.32కే రాయితీపై అందించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం సోషల్ మీడియా ద్వారా వివరాలు వెల్లడించారు. వచ్చే వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 115 రైతు బజార్లు, ప్రత్యేక మొబైల్ కౌంటర్ల ద్వారా ఈ రాయితీ ఉల్లిపాయల విక్రయాలు ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు. ఉల్లితో పాటు, చౌకధరల దుకాణాల (రేషన్ డిపోలు) ద్వారా రాయితీపై కందిపప్పు, పామాయిల్ కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్ ధరలతో పోలిస్తే దాదాపు 30 శాతం తక్కువ ధరకే నాణ్యమైన సరుకులను ప్రజలకు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి సహకారం అందిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతుందని భావిస్తున్నారు.



# అన్నా క్యాంటీన్‌లో పొంగూరు షరణి సందడి

● సామాన్యులతో కలిసి భోజనం చేసిన మంత్రి నారాయణ కుమార్తె ● 5 భోజనం నాణ్యతపై పొంగూరు షరణి ప్రశంసలు ● పేదలకు కొండంత అండ.. అన్నా క్యాంటీన్ భోజనం బాగుంది: షరణి





**నెల్లూరు,కలంకౌంటర్ :** నెల్లూరు నగరంలోని తడికలబజార్ సెంటర్‌లో ఉన్న అన్నా క్యాంటీన్‌ను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగురు నారాయణ కుమార్తె పొంగూరు షరణి ప్రత్యేకంగా సందర్శించారు. ముందుగా కౌంటర్ దగ్గర ?5 టికెట్ టోకెన్ తీసుకొని, వరుస క్రమంలో నిలబడి భోజనం తీసుకున్నారు. క్యాంటీన్‌లో అందిస్తున్న భోజన నాణ్యతను, రుచిని ఆమె స్వయంగా తిని పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు చాలా బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేసిన ఆమె, ఐదు రూపాయలకే కడుపునిండా పౌష్టికాహారం లభించడం పేదలకు, సామాన్యులకు కొండంత అండగా నిలుస్తుందని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం అక్కడికి వచ్చిన సామాన్య ప్రజలతో కలిసి షరణి భోజనం చేశారు. ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యురాలు తమతో కలిసి భోజనం చేయడమే కాకుండా, తమ క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకోవడంతో పేద ప్రజలు తీవ్ర ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి పేదవాడి ఆకలి తీర్చాలనే ఉన్నతాశయంతో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్లు ఎందరో దినసరి కూలీలకు ప్రాణధారగా మారాయని అక్కడ భోజనం చేస్తున్న స్థానికులు సంతోషంగా కొనియాడారు.

# ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ




**కావలి,కలంకౌంటర్ :** పర్యావరణాన్ని పరిరక్షిస్తూ, కాలుష్య రహితంగా వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలన్న సంకల్పంతో కావలికి చెందిన మహిళామణులు మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణంలోని 'స్త్రీ ఐక్యవేదిక' ఆధ్వర్యంలో ట్రంకు రోడ్డుతో పాటు పలు కాలనీల్లో ప్రజలకు మట్టి బొమ్మలను అందజేస్తూ, పర్యావరణ కాలుష్యంపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీవోపీ) విగ్రహాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు వాడే రసాయన రంగుల్లో మెగ్నీషియం, ఆర్సనిక్, పాదరసం, గంధకం వంటి ప్రమాదకర రసాయనాలు ఉంటాయని తెలిపారు. వీటిని నిమజ్జనం చేయడం వల్ల జలవనరులు తీవ్రంగా కలుషితమై మత్స్య సంపద నాశనమవుతుందని, ఆ నీటి ప్రభావంతో మానవాళికి క్యాన్సర్, మెదడు, నాడీ సంబంధిత తీవ్ర వ్యాధులు వచ్చే ముప్పు ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతిని, మానవ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ మట్టివినాయకులనే పూజించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్త్రీ ఐక్యవేదిక ప్రతినిధులు మాకినేని అరుణ, విద్యావతి, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు సోమశిల స్వర్ణలత, పార్వతీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన వాసవి క్లబ్ వారోత్సవాలు





**కావలి,కలంకౌంటర్ :** పట్టణంలో వాసవి క్లబ్స్ వ్యవస్థాపకులు కే.సి. గుప్తా వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వాసవి క్లబ్ వనిత లెజెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వారోత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. ఈ నెల 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు వారం రోజుల పాటు నిరంతరాయంగా పలు సామాజిక, సేవా కార్యక్రమాలను క్లబ్ సభ్యులు ఉత్సాహంగా నిర్వహించారు..ఈ ముగింపు కార్యక్రమంలో వాసవి క్లబ్ వైస్ ప్రెసిడెంట్ చక్కా లీల, డిస్ట్రిక్ట్ ఆఫీసర్ ఇన్నమూరి హేమలత, పానుగంటి వెంకటేశ్వర్లు, డాక్టర్ పాదర్తి నాగరాజు, పానుగంటి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# స్కందపురి ఆర్యవైశ్య సేవాబృందం కందుకూరు వారి ఆధ్వర్యంలో ఆర్యవైశ్యుని కుటుంబానికి 15500/-ఆర్థిక సహాయం



**కందుకూరు,కలంకౌంటర్ :** పోకూరు గ్రామానికి చెందిన పాదర్తి వెంకటనారాయణ కందుకూరు కోవూరు రోడ్ లో ఉన్న శ్రీలక్ష్మి హోటల్లో పనిచేస్తున్నాడు. వారిది పేద కుటుంబం.ప్రమాదవశాత్తు వారి తలకు బాగా దెబ్బ తగిలింది.వారి భార్య కూడా దెబ్బ తగిలి వెన్నుపూస ప్రాబ్లంతో కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రీట్మెంట్ చేయించుకున్నారు. మెరుగైన చికిత్స కోసం ఎంఆర్ఐ స్కాన్ తీయించమన్నారు.వారి వైద్యం కోసము, కుటుంబ పోషణ కోసం మమ్మల్ని సంప్రదించారు.వారి కుటుంబ పరిస్థితులను విచారించగా వారిది పేద కుటుంబం అని తెలిసింది.దాతలు అందరి సహకారంతో ఈరోజు వారికి రూ 15500/- ల అమౌంటు అందచేయడం జరిగింది.మంగళవారం కందుకూరు వాసవి నగర్ లోని వారి తమ్ముడి గృహము వద్ద వారికి అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా సహకరించిన దాతలకి ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో చక్కా వెంకట కేశవరావు,రవ్వా శ్రీనివాసులు, కోట కిషోర్, ఇన్నమూరి శ్రీనివాసులు, యాదాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

# న్యాయస్థానాల్లో నిందితులు శిక్షింపబడేందుకు సాక్ష్యాధారాల సేకరణే ప్రధానం - ఎస్పీ ఎ.ఆర్.దామోదర్




**విజయనగరం,కలంకౌంటర్ :** జిల్లాలో వివిధ పోలీసు స్టేషనుల్లో పని చేస్తున్న పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాసాంతర నేర సమీక్షా సమావేశాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో సెప్టెంబరు 8న నిర్వహించారు. వివిధ పోలీసు స్టేషనుల్లో నమోదై, దర్యాప్తులో ఉన్న వివిధ కేసులను జిల్లా ఎస్పీ సమీక్షించి, దర్యాప్తు పూర్తి చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై దర్యాప్తు అధికారులకు దిశా నిర్దేశం చేసారు. జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ నిందితులు శిక్షింపబడే విధంగా కేసుల దర్యాప్తులో సాక్షులను, సాక్ష్యాధారాలను సేకరించాలని, న్యాయస్థానంలో అభియోగ పత్రం దాఖలు చేసే ముందు అప్పటి వరకు పూర్తి చేసిన కేసు దర్యాప్తును ఒకసారి పునః సమీక్షించుకోవాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. వివిధ కేసుల దర్యాప్తులో భాగంగా సీజ్ చేసిన క్రైం ప్రాపర్టీని పోలీసు స్టేషనులో సు-రక్షితంగా ఒక క్రమపద్ధతిలో భద్రపర్చుకోవాలని, విచారణ సమయంలో వాటిని తిరిగి న్యాయస్థానంలో ప్రవేశపెట్టాలన్నారు. నిందితుల విచారణ, అరెస్టు సమయంలో వారు తెలిపే వివరాలు సరైనవా? కావా? అన్నది ముందుగా అధికారులు నిర్ధారణ చేసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఇలా చేయడం వలన ఆయా కేసుల్లో భవిష్యత్తు అవసరాలకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. వాహన తనిఖీలు చేపట్టే సమయంలో నంబరు ప్లేట్స్ లేని వాహనాలు, నంబరు ప్లేట్స్ సక్రంగా లేని వాహనాలు, అనధికార బోర్డులు కలిగిన వాహనాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని, అటువంటి వాహనాలను సీజ్ చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. నేరాలు, దొంగతనాలు జరిగేందుకు ఎక్కువగా అవకాశం ఉన్న బస్టాండులు, రైల్వే స్టేషన్లు, ఎటిఎం కేంద్రాలు, సెల్ టవర్స్ వద్ద సిసి కెమెరాలను పెట్టే విధంగా అధికారులు చొరవ చూపాలన్నారు. ఇందుకు ప్రజలు, షాపుల యజమానుల సహకారంను తీసుకోవాలన్నారు. పోలీసు స్టేషనుకు వచ్చే బాధితుల ఫిర్యాదుల పై పోలీసు అధికారులు సానుకూలంగా స్పందించాలని, తక్షణమే న్యాయం చేసేందుకు పారదర్శకంగా చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో గ్రామ స్థాయిలో సమస్యలు సృష్టించే వ్యక్తులను పార్టీలకు అతీతంగా గుర్తించి, వారిని ఎం.ఈ.ఎం.కోర్టుల్లో బైండోవరు చేయాలని, మంచి ప్రవర్తన కొరకు వారి నుండి పూచీకత్తుగా బాండులను తప్పనిసరిగా తీసుకోవాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. గంజాయి వినియోగం, రవాణ, విక్రయాలు తగ్గాయన్న నిర్లక్ష్యం వద్దని, యధావిధిగా గంజాయి నియంత్రణకు చర్యలు చేపట్టాలని, గంజాయి కేసుల్లో గతంలో అరెస్టుకాబడిన నిందితులపై నిఘా పెట్టాలన్నారు. ఈ నెల 12న నిర్వహించే లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు డిస్పోజ్ అయ్యే విధంగా పోలీసు అధికారులు ప్రణాళిక బద్ధంగా పని చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. వివిధ న్యాయ స్థానాలు జారీ చేసిన ఎన్.బి.డబ్ల్యు.లు, వివిధ పోలీసు స్టేషన్లులో పెండింగులో ఉన్న వారంట్ల మధ్య వ్యత్యాసాన్ని సరిదిద్దాలని, వాటిని ఎగ్జిక్యూట్ చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. దొంగతనాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని, జైలు నుండి విడుదలైన నేరస్థుల పైన, పోలీసు స్టేషను పరిధిలో నివసిస్తున్న పాత నేరస్థుల పైన నిఘా పెట్టాలని, రాత్రి గస్తీ, బీట్లును అమలు చేయాలని, నేరం జరిగినపుడు, దొంగతనం కేసుల్లో నిందితులను అరెస్టు చేయు సమయంలో ఇతర పోలీసు స్టేషను అధికారులతో సమాచారాన్ని ఇచ్చి, పుచ్చుకోవాలని, సమన్వయంతో పని చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. వివిధ పోలీసు స్టేషన్లులో నమోదై, దర్యాప్తులో ఉన్న లాంగ్ పెండింగు కేసులను, ఎస్సీ, ఎస్టీ కేసులు, పోక్సో కేసులు, ఎన్డిపిఎస్, మిస్సింగు, మహిళలపై జరుగుతున్న దాడుల కేసులను, గ్రేవ్, నాన్ గ్రేవ్, ఎన్ఫోర్సుమెంటు కేసులను సమీక్షించారు. ఈ నేర సమీక్ష సమావేశంలో అడ్మిన్ ఎస్పీ పి.సౌమ్యలత, బొబ్బిలి డిఎస్పీ ఆర్.గోవిందరావు, చీపురుపల్లి డిఎస్పీ ఎస్.రాఘవులు, మహిళా పిఎస్ డిఎస్పీ పి.వి.వి. నర్సింహారావు, ఎస్సీ అండ్ ఎస్టీ సెల్ డిఎస్పీ ఎం.వీర కుమార్, న్యాయ సలహాదారులు వై.పరశురాం, పలువురు సిఐలు, వివిధ పోలీసు స్టేషనుల్లో పని చేస్తున్న ఎస్ఐలు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జేఎన్‌టీయూకే 'ఏ' గ్రేడ్‌తో ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల --కళాశాలకు మరో మైలురాయి!




**కందుకూరు,కలంకౌంటర్ :**నాణ్యమైన సాంకేతిక విద్యకు చిరునామాగా నిలుస్తున్న ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల (స్వయంప్రతిపత్తి), కందుకూరు మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. జేఎన్‌టీయూ కాకినాడ ( జేఎన్టీయూకే) 2025--26 విద్యా సంవత్సరానికి అనుబంధ కళాశాలలపై నిర్వహించిన సమగ్ర మూల్యాంకనంలో కళాశాల ప్రతిష్టాత్మక 'ఏ' గ్రేడ్ సాధించింది.జేఎన్‌టీయూకే పరిధిలోని 164 అనుబంధ కళాశాలలను మూల్యాంకనం చేయగా, అందులో కేవలం 33 కళాశాలలకు మాత్రమే 'ఏం' మరియు 'ఏ' గ్రేడ్‌లు లభించాయి. ఈ ప్రతిష్టాత్మక జాబితాలో ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల చోటు దక్కించుకోవడం విశేషం. విద్యా నాణ్యత, అధ్యాపకుల ప్రతిభ, మౌలిక వసతులు, పరిశోధన, విద్యార్థుల ఫలితాలు, ప్లేస్‌మెంట్లు, పరిశ్రమలతో అనుసంధానం, సంస్థ పరిపాలన వంటి పలు కీలక ప్రమాణాల ఆధారంగా జేఎన్‌టీయూకే ఈ గ్రేడింగ్‌ను ప్రకటించింది.ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డా. కె. విజయ్ కుమార్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం కళాశాల కుటుంబం సమిష్టి కృషికి నిదర్శనమని పేర్కొంటూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలను సాధించేందుకు ఇదే స్ఫూర్తిగా ముందుకు సాగుతామని తెలిపారు.

# వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి-- సీఐ షేక్ అన్వర్ భాష



**కందుకూరు,కలంకౌంటర్ :** రాబోయే వినాయక చవితి సందర్భంగా వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి అని కందుకూరు సిఐ షేక్ అన్వర్ బాషా తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో సిఐ అన్వర్ భాష మాట్లాడుతూ కందుకూరు పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించదలచిన ఉత్సవ నిర్వాహకులు తమ ఉత్సవాలకు సంబంధించిన వివరాలను గణేష్ ఉత్సవ్ పోర్టల్ ద్వారా తప్పనిసరిగా నమోదు చేసుకుని దరఖాస్తు చేసుకోవాలి.

**ఉత్సవాల నిర్వహణకు దరఖాస్తులు, పాటించవలసిన నియమాలు:** వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన దరఖాస్తులను గణేష్ ఉత్సవ పోర్టల్ ద్వారా సమర్పించాలి. https://ganeshutsav.net/ పోర్టల్ దరఖాస్తు సమర్పించిన అనంతరం, పోలీస్ స్టేషన్ పరిధిలోని అధికారులు దరఖాస్తులను పరిశీలించి, అవసరమైన స్థల పరిశీలన నిర్వహిస్తారు. క్షేత్ర స్థాయీ ధృవీకరణ ఉత్సవ స్థలం, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు తదితర అంశాలను పరిశీలిస్తారు. ప్రతి వినాయక మండపం వద్ద తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. మండపం పరిసర ప్రాంతాలను స్పష్టంగా పర్యవేక్షించే విధంగా కెమెరాలను ఏర్పాటు చేసి, అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలి. సీసీటీవీ కెమెరాలు ఉత్సవాల నిర్వహణ కాలమంతా నిరంతరం పనిచేసే విధంగా నిర్వాహకులు నిర్వహించుకోవాలి. క్షేత్ర స్థాయీ పరిశీలన అనంతరం, ప్రభుత్వ నిబంధనలు మరియు ప్రజల ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న దరఖాస్తులను ఆమోదించడం, నిబంధనలకు అనుగుణంగా లేని దరఖాస్తులను తిరస్కరించడం జరుగుతుంది. ఉత్సవ నిర్వాహకులు పోలీస్ శాఖ సూచనలు, ప్రభుత్వ నిబంధనలు మరియు సంబంధిత అధికారుల ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలి. ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, శాంతిభద్రతలకు, ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.ప్రజల భద్రత మరియు శాంతియుత వాతావం-ణం కోసం ఉత్సవ నిర్వాహకులు, భక్తులు మరియు ప్రజలు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలి. అదేవిధంగా వినాయక మండపాల్లో తప్పనిసరిగా రాత్రి సమయాల్లో పనుకోవాలని తెలిపారు. వినాయక నిమజ్జనం 11 రోజుల్లోపు పూర్తి చేసుకోవాలి, నిమజ్జనా సమయాల్లో డీజె లో ఉపయోగించకూడదని, నిమజ్జనకు చిన్నపిల్లల అనుమతి లేదని తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ నియమ నిబంధనలో పాటించి ప్రమాదాలకు గురి కాకుండా ఉండాలని సూచించారు.

# విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా ఆర్.వి

### --- ఏకగ్రీవంగా విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యవర్గం



**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు లోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత ఉపాధ్యాయ,ఉద్యోగ సంఘ కార్యాలయం లో సంఘ ఎన్నికలు ఏకగ్రీవం గా జరిగాయి. గౌరవ అధ్యక్షులుగా సామాను బ్రహ్మయ్య, అధ్యక్షులుగా ఆర్. వెంకటేశ్వర్లు లి(ఆర్.వి )- అసోసియేషన్ అధ్యక్షులుగా కె. చెన్నయ్య, అసోసియేషన్ అధ్యక్షులు, ఆర్. వి. రమణమ్మ, ఉపాధ్యక్షులు జి. వి. కృష్ణారావు, ఉపాధ్యక్షులు వై. సత్యనారాయణ, ఉపాధ్యక్షులు జి. పున్నయ్య - ఉపాధ్యక్షులు సిహెచ్. వి. రమణయ్య, ప్రధాన కార్యదర్శిలి?ఎం. పుష్పరాజు, జాయింట్ సెక్రెటరీ లు ఎస్. కె. నజీర్ అహ్మద్, టి. బాలకృష్ణ, కె. యలమంద రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఐ. మల్యాద్రి, కోశాధికారిగా పి. శ్రీనివాస రావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఇటీవల ప్రభుత్వం పెన్షనర్లకు క్వాంటం పెన్షన్ 3%, 2 డి ఏ లు మంజూరు చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియ జేశారు. గత పి ఆర్ సి అరెయర్స్ బకాయిలు చెల్లించి పెన్షనర్లను ఆదు కోవాలని కోరారు...త్వరగా పిఆర్సి ని నియమించి తాత్కాలిక భృతి మంజూరు చేయాలని నూతన సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు.

# మచిలీపట్నం సాహితీ మణిహారం... డాక్టర్ ఓలేటి ఉమా సరస్వతి....

## -సాహితీ మిత్రుల సంస్థ అధ్యక్షులులంకిశెట్టి బాలాజీ...



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతి మీదగా రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న పురిటిగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ డాక్టర్ ఓలేటి ఉమా సరస్వతి మచిలీపట్నం సాహితీ మిత్రుల సభ్యురాలు కావడం మచిలీపట్నానికే గర్వకారణం అని సాహితి మిత్రుల సంస్థ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అన్నారు. మంగళవారం మచిలీపట్నంలో డాక్టర్ ఓలేటి ఉమా సరస్వతిని సాహితీమిత్రుల తరఫున అభినందించారు. డాక్టర్ ఓలేటి సాహితిమితులు సంస్థ సభ్యురాలుగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రావి రంగారావు "పద్య కవితలు ఒక పరిశీలన" అనే అంశంపై ఎం. ఫిల్ చేయటం "రావూరి భరరాజు పాకుడు రాళ్లు ఒక పరిశీలన అనే అంశంపై పి.హెచ్.డి పొందిన ఉత్తమ తెలుగు ఉపాధ్యాయిని ఓలేటి అని బాలాజీ అన్నారు.. ఆమె ఇప్పటికే నాలుగు పుస్తకాలు రచించి సాహితీ సేవలో తన వంతు సహాయ అందించాలని అన్నారు. సర్వ శిక్ష అభియాన్ వారి కృష్ణా తరంగాలు పిల్లల మాసపత్రిక సంపాదక వర్గం పనిచేయటం, మచిలీపట్నం సాహితీ మిత్రులు పక్షాన "కొత్త పూలు" కవితా సంకలనం పద్య పుష్పకం అనే పద్య కవిత సంకలనం, తేనె చినుకులు బడి పిల్లల కవిత సంకలనాలకు సంపాదకత్వం వహించి తనదైన శైలిలో సాహిత్య రంగానికి ఓలేటి సేవలందించారని బాలాజీ అన్నారు.

2019, 2022 సంవత్సరాలలో కృష్ణాజిల్లా విద్యాశాఖచే ఉత్తమ ఉపాధ్యాయరాలు పురస్కారాలు, రాష్ట్రస్థాయి పద్యాల పోటీలలో వచ్చినా కవిత పోటీలలో అనేక బహుమతులు ప్రశంసా పత్రాలు పొంది కవన కిరణాలు సాహిత్య సంస్థ ద్వారా కవిరత్న అనే బిరుదు, వాగ్దేవి కళా పీఠం ద్వారా కవికోకిల బిరుదు, 2023లో మహిళా రత్న 2024 లో గిడుగు పురస్కారాలను, గుంటూరు సాహితీ మిత్రులు సంస్థ ద్వారా "జీవన సాఫల్య పురస్కారాలు" పొంది నేడు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక కాబడి రాష్ట్రస్థాయిలో మచిలీపట్నం సాహితి మిత్రుల సంస్థ కి గుర్తింపు తీసుకొచ్చిన ఓలేటి ఉమా సరస్వతి రాబోయే రోజుల్లో జాతి స్థాయిలో కూడా పురస్కారాలు అందుకోవాలని సాహితీ మిత్రులు సంస్థ అధ్యక్షులు లంకి శెట్టి బాలాజీ కార్యదర్శి మేడిశెట్టి యోగేశ్వరరావు అన్నారు. సాహిత్య రంగంలో తనను ఉన్నతంగా తీసుకెళ్లడానికి ఎంతో సహకరించిన మచిలీపట్నం సాహితి మిత్రులు సంస్థ సభ్యుల సహకారం మరువలేనిదని డాక్టర్ ఓలేటి ఉమా సరస్వతి అన్నారు.

# ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** పరాసుపేటలో వేంచేసి ఉన్న శ్రీసువర్చలా సమేత ఆంజనేయ స్వామి దేవాలయంలో ఈరోజు రెండవ మంగళవారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు పూజలు అలంకరణలు నిర్వహించారు. ఆలయ భక్తబృదం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం పఠించారు.అనంతరం అన్న సమాధాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆలయ కార్య నిర్వహణ అధికారి తిక్కిసెట్టి వీర వెంకట మోహన్ రావు పర్యవేక్షించారు

# క్లస్టర్లవారీగా కామన్ ఫెసిలిటీ సెంటర్ల ఏర్పాటు దిశగా అడుగులు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకువెళ్లనున్నారు. అనకాపల్లి జిల్లా, ఎలమంచిలి మండలం, ఏటికొప్పాక కళాకారుల కోసం ఎంతో కాలంగా పనులు నిలిచిపోయిన స్థితిలో ఉన్న ఆరోగ్య కేంద్రం నిర్మాణాన్ని స్థానిక కళాకారుల వినతి మే-రకు పునఃప్రారంభించేందుకు శ్రీ పవన్ కళ్యాణ్ గారు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ ఆరోగ్య కేంద్రం త్వరలో హస్తకళాకారులకు అందుబాటులోకి రానుంది. కళకు రూపం ఇచ్చిన కళాకారులకు వారి శ్రమకు తగిన గుర్తింపు దక్కాలన్న ఉద్దేశంతో ప్రతి హస్తకళా ఉత్పత్తిపై క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి, అందులో దానికి రూపం ఇచ్చిన కళాకారుడి వివరాలు, పడిన శ్రమ తదితర వివరాలు పొందుపరిచే ఏర్పాటు చేశారు. ఎన్ని ప్రాంతాల్లో ఈ క్యూఆర్ కోడ్ ఏర్పాటు ప్రక్రియ పురోగతిని తెలుసుకున్నారు. సాంకేతికత సాయంతో నేటి తరం వినియోగదారులకు మన వారసత్వ సంప్రదాయ హస్తకళలను చేరువ చేయడంతోపాటు గ్లోబల్ మార్కెట్లకు అనుసంధానించేందుకు వీలుగా క్యూఆర్ కోడ్ అమలులో వేగం పెంచాలని సూచనలు చేశారు. క్యూఆర్ కోడ్ ఏర్పాటును అమలు చేస్తున్న అధికారులను అభినందించారు. కళాకారుల ఆరోగ్య పరిరక్షణ బాధ్యతను తీసుకున్న శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా క్లస్టర్లవారీగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. వారికి అవసరమైన మందులు ఉచితంగా అందించారు. ఆరు ఉచిత నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించి, అత్యాధునిక సాంకేతికతతో 1,708 మందికి పరీక్షలు నిర్వహించారు. సుమారు 93 మందికి శుక్లాల ఆపరేషన్లు ఉచితంగా చేయిస్తున్నారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారంలో జాప్యం వద్దు

- బాధితులకు పరిహారం త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలి
- సున్నిత ప్రాంతాల్లో కాన్ఫిడెన్స్ బిల్డింగ్ చర్యలు చేపట్టాలి-జిల్లా కలెక్టర్ డీకే బాలాజి






**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, బాధితులకు చట్టప్రకారం అందాల్సిన పరిహారాన్ని సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. కేసుల పరిష్కారంలో కేవలం ప్రక్రియాపరమైన అంశాల కారణంగా జాప్యం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు, డీఆర్వో కే. శ్రీధర్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు షేక్ షాహిద్ బాబు, కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతి, దర్యాప్తు, చార్జిషీట్ల దాఖలు, పరిహారం చెల్లింపులు, పెండింగ్ కేసులు, బాధితుల సమస్యలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. 79 మంది బాధితులకు రూ.1.30 కోట్ల పరిహారం మంజూరు 2025 జనవరి 1 నుంచి 2026 ఆగస్టు 31 వరకు జిల్లాలో ఎస్సీ, ఎస్టీ (పీ.ఓ.ఏ.) చట్టం కింద 79 మంది బాధితులకు సంబంధించిన కేసులు నమోదైనట్లు అధికారులు వివరించారు. బాధితులకు పరిహారం కింద మొత్తం రూ.1,30,33,750 మంజూరైనట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు రూ.86.28 లక్షల బడ్జెట్ విడుదల కాగా, అందులో 44 మంది బాధితులకు రూ.86,10,482 పరిహారం చెల్లించినట్లు అధికారులు వివరించారు. ఇంకా 35 మంది బాధితులకు రూ.44,23,268 పరిహారం చెల్లించాల్సి ఉందని తెలిపారు. పెండింగ్ పరిహారం చెల్లింపుల కోసం అదనపు నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. 2025 జనవరి 1 నుంచి 2026 ఆగస్టు 31 వరకు మండలాల వారీగా నమోదైన కేసుల వివరాలను కూడా సమావేశంలో పరిశీలించారు. బందరు డివిజన్ పరిధిలో 30 కేసులు, 36 మంది బాధితులు, గుడివాడ డివిజన్ పరిధిలో 19 కేసులు, 22 మంది బాధితులు, అదేవిధంగా ఉయ్యూరు డివిజన్ పరిధిలో 17 కేసులు, 21 మంది బాధితులు ఉన్నట్లు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న 35 మంది బాధితులకు పరిహారం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. భవిష్యత్‌లో పరిహారం చెల్లింపుల్లో జాప్యం లేకుండా అవసరమైన నిధుల కోసం ముందస్తు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తును పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎఫ్ఎస్ఎల్ నివేదికలు, అవసరమైన ధ్రువపత్రాలు, క్యాస్ట్ సర్టిఫికెట్లు తదితర ప్రక్రియలను వేగవంతం చేయాలని సూచించారు. కేసుల నమోదుకు, దర్యాప్తుకు, చార్జిషీట్ల దాఖలుకు సంబంధించి నిర్దేశిత గడువులను అధికారులు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. సున్నిత ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన కుటుంబాలు భయాందోళనలకు గురికాకుండా పోలీసు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం (కాన్ఫిడెన్స్ బిల్డింగ్) చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన ప్రాంతాలను డీఎస్పీ, ఆర్డీఓ, తహసీల్దార్, ఎస్‌హెచ్‌ఓలు కలిసి సందర్శించి బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నామని, బాధితుల భద్రతకు పోలీసు శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. సున్నిత ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట ముందస్తు చర్యలు చేపడతామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద వచ్చే ఫిర్యాదులపై అధికారులు అత్యంత సున్నితంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే ప్రాథమిక వాస్తవాలను పరిశీలించి, సంఘటన జరిగిన సమయం, సంబంధిత వ్యక్తుల ఉనికి, అందుబాటులో ఉన్న ఆధారాలు, తటస్థ సాక్షుల వివరాలను పరిశీలించాలని ఎస్పీ సూచించారు. నిజమైన కేసుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో సాధారణ స్థానిక వివాదాలను అనవసరంగా పెద్ద సమస్యలుగా మార్చకుండా అధికారులు వివేకంతో వ్యవహరించాలని తెలిపారు. చట్టాన్ని సమర్థంగా అమలు చేయడంతో పాటు ఆయా ప్రాంతాల్లో సామాజిక సామరస్యాన్ని కాపాడటం కూడా ముఖ్యమన్నారు.

**సంచార జీవన విధానం కలిగిన కుటుంబాలకు ప్రభుత్వ సేవలు అందాలి..** సంచార జీవన విధానం కారణంగా ఎస్టీ వర్గాలకు చెందిన యానాది కుటుంబాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న అంశాన్ని కూడా సమావేశంలో చర్చించారు. వారు ఒక ప్రాంతంలో స్థిర నివాసం ఏర్పరచుకునేలా సంఘ నాయకులు అవసరమైన సహకారం అందించాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన కుటుంబాలకు గృహ వసతి, ఆధార్, రేషన్ కార్డు, పెన్షన్, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఆధార్ కార్డులు లేని లేదా కోల్పోయిన వారికి ప్రత్యేక చర్యల ద్వారా ఆధార్ సేవలు అందించేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిపై సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో మచిలీపట్నం గుడివాడ ఉయ్యూరు ఆర్డీఓలు కే సాంబశివరావు, జి బాలసుబ్రమణ్యం, ఎస్ కరుణ కుమారి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫణి ధూర్జటి, డీఎస్పీలు ఏ శ్రీనివాసరావు, కే ధర్మేంద్ర, పాల శ్రీనివాస్, ఎస్బీ సీఐ సత్య కిషోర్, కమిటీ సభ్యులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఉల్లంఘించిన లాడ్జి యజమానులపై చర్యలు



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** లాడ్జిలను అసాంఘిక, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు వేదిక మార్చేందుకు ప్రయత్నిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని ఉయ్యూరు సీఐ టీవీవీ రామారావు హెచ్చరించారు. ఉయ్యూ రు పట్టణ పరిధిలో లాడ్జి యజమానులు, నిర్వాహకులతో మంగళవారం సమావేశం నిర్వహించి పలుసూచనలు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అనుమానస్పద వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. లాడ్జిలలో బసచేసే ప్రతివ్యక్తి వివరాలు తప్పనిసరిగా నమోదుచేయడంతో పాటు వారి గుర్తింపును ధృవీకరించే ఆధార్ కార్డు లేదా ఇతర చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్రాన్ని పరిశీలించిన తరువాతే గదులు కేటాయించాలన్నారు. సందర్శకుల పేరు, చిరునామా, మొబైల్ నంబరు, రాక పోకల సమయాలు తదితర వివరాలు రిజిష్టర్లో స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. సరైన గుర్తింపు పత్రాలు లేకుండా, అనుమానస్పద వివరాలతో వచ్చే వ్యక్తులకు గదులు ఇవ్వకూడదని స్పష్టంచేశారు. లాడ్జి పరిసరాలతో పాటు ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లో సీసీ కెమేరాలు సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలని, రికార్డింగ్ నిర్దేశిత కాలం వరకు భద్రపరచాలని వివరించారు. లాడ్జి నిర్వాహకులు పోలీసులకు సహకరించడం ద్వారా నేరాల నివారణకు, ప్రజల భద్రతకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించినా, తెలిసే చట్టవిరుద్ధ కార్యకలాపాలకు సహకరించినా, అనుమానస్పద, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు తావిస్తే సంబంధిత లాడ్జి యాజ మాన్యంపై చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

# మంగళగిరి కొండపై పునుగుపిల్లి...!!?

- శ్రీవారి సేవలో శతాబ్దాలుగా ప్రత్యేకత చాటుకున్న అరుదైన జీవి..
- జనారణ్యంలో ప్రత్యక్షంపై ఆసక్తికర చర్చ

**మంగళగిరి,కలంకౌంటర్ :** అది మామూలు అడవి జంతువు కాదు. కనిపిస్తే చాలామందికి వెంటనే గుర్తుపట్టడం కూడా కష్టం. కానీ ఆలయ సంప్రదాయాల్లో దానికి ఉన్న స్థానం మాత్రం ఎంతో ప్రత్యేకం. అలాంటి అరుదైన పునుగుపిల్లి మంగళగిరి కొండపై కనిపించిందన్న వార్త ఇప్పుడు భక్తుల్లో, స్థానికుల్లో ఆసక్తిని రేపుతోంది. శనివారం పానకాల నరసింహస్వామి కొండపైకి వెళ్తున్న భక్తుల కంటపడిన ఈ జీవి కొద్దిసేపు అక్కడ సంచరించినట్లు తెలుస్తోంది.సాధారణంగా దట్టమైన అడవులు, కొండ ప్రాంతాల్లో సంచరించే పునుగుపిల్లి పట్టణానికి ఆనుకుని ఉన్న మంగళగిరి కొండపై కనిపించడం సహజంగానే అందరి దృష్టినీ ఆకర్షించింది. అయితే అక్కడ కనిపించింది పునుగుపిల్లేనా...? లేక దాన్ని పోలిన మరో జీవినా...? అనే ప్రశ్నకు అటవీశాఖ అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది.

**అడవుల్లోని జీవి.. ఆలయ సంప్రదాయంలో ప్రత్యేక స్థానం..** పునుగుపిల్లి పేరు వినగానే చాలామందికి ముందుగా గుర్తుకొచ్చేది తిరుమల శ్రీవారి ఆలయ సంప్రదాయమే. ఈ చిన్న వన్యప్రాణి నుంచి లభించే సుగంధ పదార్థంతో తయారయ్యే తైలానికి శతాబ్దాలుగా ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉంది. పునుగుపిల్లి శరీరంలోని తోకకు సమీపంలో ఉన్న ప్రత్యేక గ్రంథుల నుంచి స్రవించే సుగంధ ద్రవాన్ని సేకరిస్తారు. అది గాలికి ఆరిన తర్వాత మైనంలాంటి పదార్థంగా మారుతుంది. దీనిని నువ్వుల నూనె, కస్తూరి, పచ్చకర్పూరం తదితర సుగంధ ద్రవ్యాలతో కలిపి ప్రత్యేకమైన తైలాన్ని తయారు చేస్తారు. తిరుమలలో ప్రతి శుక్రవారం జరిగే అభిషేక సేవ అనంతరం మూలవిరాట్‌కు ఈ తైలాన్ని లేపనంగా ఉపయోగించే సంప్రదాయం కొనసాగుతోంది. స్వామివారి విగ్రహానికి నిగారింపు, పరిరక్షణ కల్పించడంతో పాటు దివ్య తేజస్సును ప్రసాదిస్తుందని భక్తుల విశ్వాసం. ఒక చిన్న వన్యప్రాణి.. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు ఆరాధించే శ్రీవారి సేవలో భాగం కావడం వెనుక ఉన్న సంప్రదాయమే పునుగుపిల్లికి ప్రత్యేక గుర్తింపును తెచ్చింది.

**శతాబ్దాల నాటి ఆనవాళ్లు..** పునుగుపిల్లి తైల వినియోగం కొత్తగా ఏర్పడిన ఆచారం కాదు. దక్షిణ భారతదేశంలోని ప్రాచీన ఆలయ సంప్రదాయాల్లో దీనికి సంబంధించిన ప్రస్తావనలు కనిపిస్తాయి. తిరుమలలో మాత్రం ఇది ప్రత్యేకమైన ఆగమ సంప్రదాయంగా కొనసాగుతున్నట్లు చెబుతారు. కాలం మారినా ఆచారం మాత్రం కొనసాగుతుండటంతో పునుగుపిల్లి పేరు ఆలయ సేవలతో ముడిపడిపోయింది. అయితే ఇదే సమయంలో మరో అంశం కూడా ముఖ్యమైంది. పునుగుపిల్లి సాధారణంగా కనిపించే జంతువు కాదు. వన్యప్రాణి సంరక్షణ చట్టం పరిధిలో రక్షణ పొందుతున్న అరుదైన జీవి కావడంతో దాని సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది.

**రక్షణే ముఖ్యం..** పునుగుపిల్లి కనిపించిందన్న ఆసక్తితో దాని వద్దకు వెళ్లడం, పట్టుకునేందుకు ప్రయత్నించడం, తరలించడం వంటివి చేయకూడదు. అది నిజంగా పునుగుపిల్లే అయితే అటవీశాఖ అధికారులే దాని పరిస్థితిని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలి.శ్రీవారి సేవలో ఉపయోగించే తైలానికి అవసరమైన పదార్థం అందుబాటులో ఉండేలా తిరుమల తిరుపతి దేవస్థానం పునుగుపిల్లుల సంరక్షణకు చర్యలు చేపడుతోంది. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర జంతు ప్రదర్శనశాలలో వీటి సంరక్షణకు ఏర్పాట్లు ఉన్నాయి.

**మంగళగిరి కొండపైకి ఎలా వచ్చింది...?..** ఇప్పుడు అందరి ఆసక్తి ఒక్క ప్రశ్నపైనే ఉంది. అడవుల్లో సంచరించే అరుదైన జీవి మంగళగిరి కొండపైకి ఎలా వచ్చింది. ....? మంగళగిరి కొండ ప్రాంతంలో సహజసిద్ధమైన రాళ్ల ప్రాంతాలు, పొదలు, చెట్లతో కూడిన ఆవాసాలు ఉన్నాయి. అలాంటి వాతావరణం వన్యజీవులకు అనుకూలంగా ఉండే అవకాశం ఉంది. అయితే కనిపించిన జీవి పునుగుపిల్లేనని అధికారిక నిర్ధారణ లేకుండా ఏ నిర్ణయానికీ రావడం సరికాదు. అటవీశాఖ అధికారులు పరిశీలించి జాతిని నిర్ధారిస్తే ఈ ఆసక్తికర ఘటనకు స్పష్టత వస్తుంది. నిజంగానే పునుగుపిల్లి అయితే మాత్రం మంగళగిరి కొండ జీవ వైవిధ్యంపై మరోసారి అందరి దృష్టినీ మళ్లించే అరుదైన ఘటనగా ఇది నిలిచే అవకాశం ఉంది. ఒకవైపు పానకాల నరసింహస్వామి కొండ ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలుస్తుండగా.. మరోవైపు అదే కొండపై అరుదైన వన్యజీవి కనిపించిందన్న సమాచారం ప్రకృతి ప్రేమికుల్లోనూ ఆసక్తి కలిగిస్తోంది. భక్తుల రాకపోకల మధ్య కొండపైకి వచ్చిన ఈ 'అడవి అతిథి' నిజంగా పునుగుపిల్లేనా...? అన్నది ఇప్పుడు అటవీశాఖ నిర్ధారణ కోసం ఎదురుచూస్తున్న ప్రశ్న.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com